క్లుప్తంగా

నేడు మండలంలో మంత్రి జోగి రమేష్ పర్యటన

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం మండలంలో పర్యటిస్తారని మంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మండల పరిధిలోని నడుపూరు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు పాల్గొంటారన్నారు. అనంతరం నడుపూరు సచివాలయ పరిధిలోని మెరికేపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని, ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని తెలియజేయడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. నడుపూరు సచివాలయ పరిధిలోని కూడూరు గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. కూడూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయం పేర్కొంది.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని వినతి

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని తెలుగురావుపాలెంలో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు జిల్లా కలెక్టర్ రాజాబాబుకు విన్నవించారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములు లేకపోవడంతో పంచాయతీ పరిధి దాటి భూములు కొనుగోలు చేసి నివేశన స్థలాలు ఇచ్చారన్నారు. దీనిపై కొందరు కోర్టులో కేసు వేయడంతో నివేశన స్థలాల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందన్నారు. కోర్టులోని సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు నివేశన స్థలాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నేడు రామానగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

లక్ష్మీపురం(చల్లపల్లి): లక్ష్మీపురం గ్రామ సచివాలయం-3 పరిధిలోని రామానగరంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఎంపీడీవో చేకు చిన రాట్నాలు తెలిపారు. రామానగరం ఆంజనేయ స్వామి దేవాలయం వెనుక కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులు ఉచితంగా పొందాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ పోస్టల్ దినోత్సవం



బంటుమిల్లి: అంతర్జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులను స్థానిక బ్రాంచి పోస్టాఫీసుకు తీసుకెళ్లి తపాలా శాఖ నిర్వహణపై అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖ ఆవిర్భావం, పట్టణాల నుంచి మారుమూల ప్రాంతాల వరకు అందిస్తున్న సేవలను పోస్ట్ మాస్టర్ ప్రభుకుమార్ విద్యార్థులకు వివరించారు. ప్రతి 6,623 మంది జనాభాకు ఒక పోస్టాఫీసు ద్వారా పలు రకాల సేవలు అందిస్తున్నామన్నారు. బ్యాంకులతో సమానంగా పోస్టాఫీసుల ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్లు ఎం.వి.రామకృష్ణ, జి.నానిబాబు, ఎం.టి.ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

27న అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ బస్సు

గుడివాడటౌన్: ప్రతి నెలా పౌర్ణమి రోజు అరుణాచల క్షేత్ర గిరి ప్రదక్షిణకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తుందని గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ డి.రాజేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు గుడివాడలో బయలుదేరి 28న కాణిపాకం, శ్రీపురం దేవాలయాలను దర్శించుకుని అరుణాచలం చేరుకుంటుంది. 29వ తేదీ గిరి ప్రదక్షిణ అనంతరం బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి దర్శనం చేసుకుని 30వ తేదీ ఉదయానికి గుడివాడకు చేరుకుంటుందన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. 73829 03299 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టండి

గుడివాడటౌన్: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు వాటి అనుబంధ సంస్థలపై నైపుణ్యాన్ని పెంపొందించుకోడానికి కృషి చేయాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి సీహెచ్ రామకృష్ణ అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలో క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జి.వెంకటరత్నం, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన



మెరకనపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు తెలిపారు. గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శిబిరాలకు ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఉచితంగా మందులను పొందుతున్నారు. గ్రామాల్లోనే వైద్య సేవలు అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని మెరకనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. పేద వర్గాల వారు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేక చాలా అవస్థలు పడుతున్నారని చెప్పారు. పేదలను దృష్టిలో పెట్టుకుని జగనన్న ప్రభుత్వం వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పుడు మరో అడుగుముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గ్రామంలోనే ఏర్పాటు చేయడంతో పాటు నెలకు రెండు పర్యాయాలు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముత్యాల వరలక్ష్మి, గ్రామ పార్టీ కన్వీనర్ యర్రంశెట్టి రాంబాబు, ముత్యాల గోపాలరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు హారిక, శ్రీరాం సాయి, ఎల్.లక్ష్మీనాథ్, అనిల్ కుమార్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, పలుశాఖల అధికారులు, ఎస్ఐ సీహెచ్ పద్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తలగడదీవిలో 524 మందికి పరీక్షలు

తలగడదీవి(నాగాయలంక): మండలంలోని పర్ర చివర సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష సేవల శిబిరాన్ని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సర్వేలో గుర్తించిన 524 మంది పేషెంట్స్‌కు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష సేవలతో పేద ప్రజలకు ఇంటింటా వైద్య సేవలు అందుబాట్లులోకి వచ్చాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఈ అమూల్యమైన వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు అదృష్టమని, ఆరోగ్యంపై అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు వైద్య, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ తారకేశ్వరరావు, ఎదురుమొండి పీహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ రాజేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంచాకోడూరులో 576 మందికి వైద్య పరీక్షలు

గూడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం కంచాకోడూరు సచివాలయం పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మాధురి ఆధ్వర్యంలో వైద్య బృందం కంచాకోడూరు, మద్దిపట్ల, ఆకుమర్రు గ్రామాలకు చెందిన 576 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆప్తాలమీకి సంబంధించి ముగ్గురు, జనరల్ సర్జరీకి సంబంధించి ఒక పేషెంట్‌ను మెరుగైన వైద్య చికిత్స కోసం నెట్‌వర్క్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. తహసీల్దార్ బి.వి జయప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, ఈవోపీఆర్డీ పి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి టి.వి.వి.భాస్కరరావు, మద్దిపట్ల సర్పంచ్ బత్తిన సరిత, కంచాకోడూరు వైస్ సర్పంచ్ మేడా స్వర్ణకుమారి, నాయకులు మేడా అంజిబాబు, గుడివాడ సంపత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

511 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: మండలంలోని మణిమేశ్వరం(అర్తమూరు-2 గ్రామసచివాలయర) పరిధిలో స్థానిక యూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 511 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. 247 మందికి రక్త పరీక్షలతో పాటు పలు రకాల వైద్యపరీక్షలు చేశారు. బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.పవన్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో వైద్యులు రంగనాథ్, సురేఖ, గంగరాజు, సౌందర్య, సువర్చల, జయశ్రీలతో పాటు తహసీల్దార్ ఎం.వి. సత్యనారాయణ, ఎంపీడీవో కె.స్వర్ణభారతి, మాజీ సర్పంచ్ డి.మధుసూదనరావు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఉల్లిపాలెం, హంసలదీవి పంచాయతీల ప్రజలకు వైద్యసేవలందించారు. వైద్యనిపుణులు ఈర్ల వివేక్, మౌనిక, గంగాధరరావు, కె.మానసదేవిలు రోగులకు నేత్ర, జనరల్, ఆర్థోపెడిక్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు.
అవసరమైన వారికి రక్తపరీక్షలు చేయడంతో పాటు ఈజీసీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. చిన్నారుల నేత్ర పరీక్షలు చేయడంతో పాటు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 506 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార, చిరుధాన్యాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సర్పంచ్‌లు వెర్రీ పావని, కొక్కిలిగడ్డ బిక్షాలు శిబిరాన్ని ప్రారంభించగా, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, సచివాలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవరకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని దేవరకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.సుబ్బారావు, తహసీల్దార్ బి.రామానాయక్, ఈవోపీఆర్డీ జి.కిశోర్, సర్పంచ్‌లు మద్దాల వెంకటేశ్వరరావు, డోకిపర్తి శాంతకుమారి, పీహెచ్‌సీ వైద్యులు ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ మోడెం నాగరాజు, ఎంపీ ఎంపీటీసీ కొప్పుల రాములమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కృత్తివెన్నులో జగనన్న ఆరోగ్య సురక్ష

కృత్తివెన్ను: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న అద్భుతమైన నిర్ణయం జగనన్న ఆరోగ్య సురక్ష అని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కృత్తివెన్ను సచివాలయ పరిధిలోని గ్రామాలకు కృత్తివెన్నులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజీవ్ ప్రారంభించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, ఎంపీడీవో పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, పార్టీ నాయకులు శేఖర్, నాయుడు, బుజ్జిబాబు పాల్గొన్నారు.



కృత్తివెన్నులో మెడికల్ కిట్ అందజేస్తున్న జోగి రాజీవ్, నాయకులు



తలగడదీవి శిబిరంలో మందులు అందజేస్తున్న సిబ్బంది



కంచాకోడూరులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



ఉల్లిపాలెం శిబిరంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



దేవరకోటలో పర్యవేక్షిస్తున్న నాయకులు



ఉల్లిపాలెంలో చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజల పరిపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మంగినపూడిలో మందులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో గీతాభాయి

కోనేరుసెంటర్: ప్రజలు పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి గీతాభాయి తెలిపారు. మండల పరిధిలోని మంగినపూడిలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, శిబిరంలో వైద్య సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలను దగ్గరుంచి పరిశీలించిన ఆమె సిబ్బందికి అవసరమైన పలు సలహాలు అందజేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి శిబిరంలో వందలాది మంది జనం వచ్చి ఆరోగ్యపరమైన పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. అవసరాన్ని బట్టి బాధితులకు మెరుగైన వైద్యం నిమిత్తం పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేయడంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. మంగినపూడిలో జరిగిన శిబిరంలో 460 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధుల తీవ్రతను బట్టి ఆస్పత్రులకు వివిధ ఆస్పత్రులకు సిఫార్సు చేశారన్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో తపసిపూడి సర్పంచ్ చందన మస్తాన్‌రావు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడ సభకు తరలివెళ్లిన నాయకులు



ఎమ్మెల్యే పేర్ని నానితో నాయకులు

మచిలీపట్నంటౌన్: విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సమావేశానికి మచిలీపట్నం నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) ఆధ్వర్యంలో వీరంతా ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు పయనమయ్యారు. బస్సులో ఎమ్మెల్యే పేర్ని నాని జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజాప్రతినిధులు, నాయకులను ఉత్సాహపరిచారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. విజయవాడ తరలివెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు ఉన్నారు.

విద్యుత్ మీటర్ల ఆకస్మిక తనిఖీ



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణానాయక్

తోట్లవల్లూరు: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు, సిబ్బంది 30 బృందాలుగా ఏర్పడి సోమవారం ఆకస్మిక తనిఖీ జరిపారు. 2350 ఇంటి సర్వీసులు, 58 వాణిజ్య, 5 ఆక్వా సర్వీసులను తనిఖీ చేసినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. 262 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి, రూ.8.28 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఉయ్యూరు ఈఈ కృష్ణానాయక్, డీఈఈ ఎంవీవీ రామకృష్ణ, ఏఈఈ దేవదాస్, సిబ్బంది ప్రసాద్, వాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మోపిదేవిలో ఆర్టీసీ బస్సు- ఆటో ఢీ

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్ మలుపులో అవనిగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ఆటో ముందు భాగం దెబ్బతింది. విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం గుడి మలుపులో ఆగి ఉన్న కారును తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. మోపిదేవి నుంచి మేకావారిపాలెం వెళ్తున్న ఆటో తీవ్రంగా దెబ్బతినడంతో పాటు ఆటో డ్రైవర్ వసంతరావుకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ప్రయాణికులను వేరే బస్సులో అవనిగడ్డకు పంపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



పద్మ(ఫైల్)

గుడివాడరూరల్: పట్టణంలోని పెద ఎరుకపాడుకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ బి.తులసీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెద ఎరుకపాడు ప్రాంతానికి చెందిన గడ్డం వేణు భార్య పద్మ(50) ఈనెల 2వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులు అందరూ పడుకున్న తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయి అదృశ్యమైందన్నారు. ఈ క్రమంలో భర్త వేణు బంధువులు, స్నేహితులను వివరాలు అడుగగా పద్మ ఆచూకీ లభ్యం కాలేదని, దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. భర్త వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పద్మ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పద్మ ఆచూకీ తెలిసిన వారు 83329 83797, 94407 96424 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లా పోటీలకు అసిసీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సెబాస్టియన్, కరెస్పాండెంట్ మేరీ జోసఫ్

పామర్రు: త్వరలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పామర్రు అసిసీ విద్యార్థులు ఎంపిక అయ్యారని అసిసీ హెచ్‌ఎం వలసా సెబాస్టియన్ తెలిపారు. స్థానిక అసిసీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను సోమవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెనమకూరులో జరిగిన పోటీలలో తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక య్యారని అన్నారు. జూనియర్స్ షార్ట్‌పుట్ విభాగంలో కె.ఆయుష్మా పాప, కె లక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారని అన్నారు. లాంగ్ జంప్‌లో లిఖిత్‌సాయి తృతీయ స్థానం, డిస్కస్ త్రో జూనియర్స్ విభాగంలో నాగ క్షీరజ ప్రథమ స్థానం సాధించారన్నారు. జూనియర్స్ లాంగ్‌జంప్‌లో జె.షర్మిల తృతీయ స్థానంలో గెలుపొందారని తెలిపారు. సీనియర్స్ విభాగంలో ట్రిబుల్ జంప్‌లో శాయి రూపేష్, డి.దయాకర్ ప్రథమ, ద్వితీయ స్థానాలను, లాంగ్ జంప్‌లో వి.కరుణకుమార్ ప్రథమ స్థానం, వాకింగ్‌లో గౌరీశంకర్ తృతీయ స్థానం పొందారన్నారు. విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎం.గ్లాడిసన్‌ను హెచ్‌ఎం సెబాస్టియన్, పాఠశాల కరస్పాండెంట్ మేరీ జోసఫ్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో శివలింగాల ఊరేగింపు



నగరంలో శివలింగాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న నిర్వాహకులు

మచిలీపట్నంటౌన్: కాశీ మహాక్షేత్రం వద్ద నవంబరులో నిర్వహించే కోటి లింగాల అభిషేకం, అర్చనకు వినియోగించే శివలింగాలను తయారుచేసిన మచిలీపట్నం వాసులు సోమవారం రాత్రి ఆ శివలింగాలను నగరంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ జవ్వారుపేట సెంటరు నుంచి నాగపోతరావుసెంటరు మీదుగా ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరి అక్కడి నుంచి కోనేరుసెంటర్‌కు ఈ ఊరేగింపు చేరింది. కాశీ మహాక్షేత్రంలో జరిగే కోటిలింగాల అభిషేకం కార్యక్రమానికి గానూ మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు 6.50 లక్షల చిన్న శివలింగాలను తయారుచేశారు. ఈ శివలింగాలను ఊరేగింపు అనంతరం శ్రీ విజయానంద గురు సేవాసమితి నిర్వాహకులకు అందజేశారు. ఈ ఊరేగింపునకు వారణాసికి చెందిన సైకిల్‌బాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో శివలింగాల తయారు చేసిన ప్రతినిధులు కె.చిట్టికుమారి, సామా కుమారి, కందుల లలికుమారి, జెఎస్ఎస్ కృష్ణారావు, యెండూరి సురేష్, భక్తులు పాల్గొన్నారు.

● వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు నేతల హాజరు



సభకు హాజరైన ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్‌బాబు, నేతలు

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన

లక్ష్మీపురం(చల్లపల్లి): రామానగరంలో ఆంజనేయ స్వామి గుడి వెనుక నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రోటరీ క్లబ్ ప్రతినిధులు స్థలం పరిశీలించారు. పాత కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరడంతో రూ.కోటి సీఎస్ఆర్ నిధులు సమీకరించి నూతన కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోటరీక్లబ్ ప్రతినిధులు తమ వంతు భాగస్వామ్యం అందించేందుకు స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

250 మందికి హోమియో వైద్య పరీక్షలు

చల్లపల్లి: సీఆర్ వికాస కేంద్రంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వికాస కేంద్రం ప్రాంగణంలోని హోమియో సెంటర్‌లో చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హోమియో వైద్యులు డాక్టర్ నేతి ప్రభాకరరావు, డాక్టర్ ఎస్‌వీపీ దివ్యరాశి 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. వికాస కేంద్రం ఇన్‌చార్జి మేకా నరసింహారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు పర్యవేక్షణలో ట్రస్ట్ సిబ్బంది రోగులకు మందులు అందజేశారు.